క్లుప్తంగా

ఉద్యోగుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘ నేతలు

విజయనగరం అర్బన్: ఏపీజీఈఏ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యల సాధన నేపథ్యంలో గురువారం ప్రారంభించిన రెండవ విడత ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఉద్యోగుల డిమాండ్ల వినతిపత్రాన్ని కలెక్టర్ నాగలక్ష్మి ఎస్‌కి సభ్యులు అందజేశారు. కలెక్టర్‌ని కలిసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షుడు పి.రామచంద్రరావు, ప్రధాన కార్యదర్శి కంది వెంకటరమణ, రాష్ట్ర నాయకులు యుగంధర్, జిల్లా కోశాదికారి వై.శంకరరావు, ఉపాధ్యక్షుడు పీవై అనిల్‌కుమార్, సంయుక్త కార్యదర్శులు వెంకటేశ్వరరావు, అనిల్‌కుమార్, అర్బన్ అధ్యక్షుడు బాల భాస్కర్, ఉపాధ్యక్షులు బి.చంద్రశేఖర్, ఎం.కవిత, కేపీనాయుడు తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చీపురుపల్లి: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న మూడు అంగన్‌వాడీ ఆయా పోస్టులకు అర్హులు నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీఓ కె.వి.ఎన్. రాజేశ్వరి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. చీపురుపల్లి మండలంలోని మోదుగులపేట, మెరకముడిదాం మండలంలోని బోడందరవలస, గరివిడి మండలంలోని కుమరాం-1 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాతిపదికన అభ్యర్థులు జూన్ 22 సాయంత్రం 5 గంటలులోగా ప్రాజెక్టు కార్యాలయానికి నేరుగా కానీ, పోస్టు ద్వారా కానీ దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

పైరవీలు, అవినీతికి తావులేదు

గుర్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పైరవీలు, అవినీతికి తావులేదని, అర్హులందరికీ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని పెనుబర్తిలో మూడోరోజు గురువారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో పథకాలు కావాలంటే జన్మభూమి కమిటీలకు లంచాలు ఇవ్వాల్సి వచ్చేదని, టీడీపీ సానుభూతి పరులకే పథకాలు అందేవని గుర్తు చేశారు.ఎంపీడీఓ కల్యాణి, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు తుమ్మగుంటి పరమేష్, రెడ్డి అచ్యుత్‌రావు, అంబల్ల చిన్నారావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

గుర్ల: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చీపురుపల్లి డీఎస్పీ ఏ.ఎస్.చక్రవర్తి అన్నారు. మండలంలోని ఆనందపురంలో అంబేడ్కర్ ఇండియన్ మిషన్(ఎయిమ్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని గురువారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, సమాజ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని సూచించారు. కార్యక్రమంలో ఎయిమ్ సంస్థ సభ్యులు అడ్డూరి సీతబాబు, కెల్ల భీమారావు తదితరులు పాల్గొన్నారు.

రూ.2.5 లక్షలతో ఇంటింట కుళాయిలు

వేపాడ: మండలంలోని నీలకంఠరాజపురంలో ఇంటింట కుళాయిల ఏర్పాటు పనులకు సర్పంచ్ గొటివాడ దేవీ ఆధ్వర్యంలలో ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు గురువారం భూమి పూజ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ రూ. 2.5 లక్షల వ్యయంతో పనులు చేపట్టి, ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా త్వరలో రక్షిత తాగునీరు అందించనున్నట్లు చెప్పారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కళాశాలకు ఆర్‌ఓ వాటర్ ప్లాంట్లు మంజూరు

చీపురుపల్లి: పట్టణంలోని జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందుబాటులోకి వచ్చింది. కళాశాలకు ప్రభుత్వం రెండు ఆర్‌ఓ వాటర్ ప్లాంట్లను మంజూరు చేసింది. వీటిని వినియోగానికి సంబంధిత సిబ్బంది సిద్ధం చేశారు. ప్రిన్సిపాల్ మద్దిలి వినోద్‌బాబు వాటర్ ప్లాంట్లను గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నాడు-నేడు పథకంలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో శతశాతం సదుపాయాలు కల్పిస్తోందని చెప్పారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా కళాశాలకు రెండు ఆర్‌ఓ వాటర్ ప్లాంట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు.

చివర దశకు మన బడి నాడు - నేడు పనులు

- విజయనగరం, నెల్లిమర్ల నియోజకవర్గాల పరిధిలోని 207 స్కూళ్లలో రెండవ విడత పనులు
- స్కూళ్ల ప్రారంభం నాటికి పనులు పూర్తి : డీఈఓ



పాఠశాలలో నాడు నేడు అభివృద్ధి పనులు

విజయనగరం అర్బన్: ప్రభుత్వ విద్యను పటిష్టపరిచే లక్ష్యంతో చేపడుతున్న 'మన బడి నాడు నేడు' అభివృద్ధి పనులు జిల్లాలో జోరందుకున్నాయి. ఇప్పటికే ఆంగ్లబోధన అమలు అంశం, ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాల పెంపు వంటి ఆన్‌లైన్ వాటిని నిర్వహిస్తూ కొనసాగుతున్నాయి. మరోవైపు పాఠశాల భవన సుందరీకరణ, మౌలిక సదుపాయాల కల్పన వంటి పనుల కోసం ప్రభుత్వం చేపడుతున్న 'మన బడి నాడు-నేడు' పథకం మరింత పారదర్శకంగా సాగుతోంది. జిల్లాలో తొలి విడతగా 1,060 స్కూళ్లలో ఈ పథకం పరిపూర్ణంగా నిర్మాణ పనులు పూర్తి చేసి రెండవ విడతగా 779 స్కూళ్లలో పనులను మరింత పారదర్శకంగా చేపడుతోంది. ఇందులో భాగంగా విజయనగరం, నెల్లిమర్ల నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాలు, ఒక కార్పొరేషన్, ఒక నెల్లిమర్ల నగర పంచాయతీలలోని 207 స్కూళ్లలో 293 అభివృద్ధి పనులను చేపట్టడానికి విద్యాశాఖ చర్యలు తీసుకుంది. ఇందుకోసం రూ.65.15 లక్షల నిధులను వెచ్చించడానికి పంపిన ప్రతిపాదనలకు అనుమతి లభించింది.

మార్గదర్శకాల్లో మౌలిక వసతుల కల్పన

నియోజకవర్గ స్థాయిలో మన బడి నాడు నేడు వివరాలు..

నియోజకవర్గం	మండలాలు	పాఠశాలలు	మొత్తం పనులు	నిధులు
విజయనగరం	01	51	87	రూ.22.64 లక్షలు
నెల్లిమర్ల	04	156	206	రూ.42.51 లక్షలు

తొలి విడత 'మన బడి నాడు నేడు' కార్యక్రమం కింద పాఠశాలల్లో మాత్రమే అభివృద్ధి పనులు చేపట్టారు. తాజాగా రెండో విడతలో పాఠశాలలు, జూనియర్ కళాశాలతో పాటు హాస్టళ్లలో ఫర్నిచర్, అల్మారాలు, బెడ్లు, మంచాలు ఏర్పాటు చేయనున్నారు. జూనియర్ కళాశాలల్లో అభివృద్ధి పనులతో పాటు ల్యాబ్ పరికరాలు, ఫర్నిచర్ అందుబాటులోకి తీసుకురానున్నారు. గతంలో 9 అంశాలకు ప్రాధాన్యత ఇవ్వగా.. తాజాగా విడుదల చేసిన రెండో విడత పనుల్లో కిచెన్ షెడ్ల నిర్మాణాన్ని సైతం జోడించారు. దీంతో మొత్తం 10 అంశాలకు ప్రాధాన్యతమిస్తున్నట్లయ్యింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఇంగ్లిష్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి ఇంగ్లిష్ ల్యాబ్‌కు స్మార్ట్ టీవీ తప్పనిసరి చేస్తూ అమలులోకి తెస్తారు. వీటితో పాటు అదనంగా తరగతి గదుల నిర్మాణం చేపడుతున్నారు.

ప్రాధాన్యత అంశాలు

తాగునీటి సరఫరా, మరుగదొడ్లకు నిరంతర నీటి సరఫరా, చిన్న, పెద్ద మరమ్మతులు, విద్యుత్ సౌకర్యంతో పాటు ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్ల ఏర్పాటు, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, సిబ్బందికి అధునాతన ఫర్నీచర్, గ్రీన్ చాక్ బోర్డులు, స్కూల్ క్యాంపస్‌కు అంతటా రంగులు, ఇంగ్లిష్ ల్యాబ్ (స్మార్ట్ టీవీ, డిజిటల్ సాధనాలు), కిచెన్ షెడ్లు, ప్రహరీల నిర్మాణం.

గ్రామ సచివాలయ ఇంజినీర్లకు పర్యవేక్షణ బాధ్యతలు

రెండో విడత నాడు నేడు పనుల పర్యవేక్షణపై పటిష్ట వ్యవస్థలు ఏర్పాటు చేశారు. ఇంతవరకు మండల స్థాయి ఇంజినీరుకున్న పర్యవేక్షణ బాధ్యతను తప్పించారు. మండల పరిధిలోని స్కూళ్లన్నింటినీ పరిశీలించలేని పరిస్థితులను గుర్తించారు. ఈ నేపథ్యంలోనే మండల ఇంజినీర్ పర్యవేక్షణలో కాకుండా గ్రామ సచివాలయం ఇంజినీర్ పర్యవేక్షణలో పనులు చేయాలని నిర్ణయించారు. గ్రామ పరిధిలోని అన్ని పాఠశాలల 'నాడు నేడు' పనులకు సచివాలయ ఇంజినీర్ జవాబుదారీగా ఉంటారు. ఇంజినీరింగ్ అభివృద్ధికి సంబంధించిన ఎం.బుక్‌లు సచివాలయం ఇంజినీర్ నిర్వహించాల్సి ఉంటంది.

స్కూళ్ల ప్రారంభం నాటికి పనులు పూర్తి



రెండో విడత నాడు నేడు పనులు దాదాపు పూర్తి కావస్తున్నాయి. వీటితో పాటు అదనపు తరగతి గదుల నిర్మాణాలు కూడా చేపడుతున్నాం. స్కూళ్ల ప్రారంభం నాటికి రెండో విడత నాడు నేడు పనుల్లోని మౌలిక సదుపాయాల పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులు జరుగుతున్నాయి. తొలి విడత 'మన బడి నాడు నేడు' పథకం అమలులో భాగంగా జిల్లాలోని 1,076 ప్రభుత్వ పాఠశాలలకు రూ.223 కోట్లు వెచ్చించడంతో అధునాతనంగా మారాయి. దీంతో తొలి ఏడాదిలోనే గత ఏడాది కంటే దాదాపు 15 వేల మంది అదనంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. రెండో విడతగా 737 స్కూళ్లలో 1,001 నాడు నేడు పనులను చేపడుతున్నాం.

-బి.లింగేశ్వరరెడ్డి, డీఈఓ

తల్లిదండ్రుల కమిటీ పర్యవేక్షించాల్సిన పనులు

పాఠశాలకు చెందిన అభివృద్ధి పనులన్నీ తల్లిదండ్రుల కమిటీ పర్యవేక్షణలోనే కొనసాగుతాయి. తల్లిదండ్రుల కమిటీలో ఐదుగురు సభ్యులు తప్పనిసరిగా ఉండాలి. ఇందులో ముగ్గురు మహిళలు సభ్యులుగా ఉంటారు. నాడు నేడుకు సంబంధించి 9 మందిని భాగస్వామ్యం చేశారు. ఇందులో ఐదుగురు పేరెంట్స్ కమిటీ సభ్యులు, హెచ్‌ఎం, సచివాలయం ఇంజినీర్, సీఆర్పీ, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ఉంటారు. ప్రతి పనికీ వీరిలో ఏడుగురు తప్పనిసరిగా ఆమోదం తెలిపాల్సి ఉంటుంది. వీరికి ఉమ్మడి ఖాతాతో పాటు చెక్ పవర్ ఉండేలా నిర్ణయిం తీసుకున్నారు.

వైభవంగా శ్రీవారి విగ్రహ ప్రతిష్ఠ

- ఆలయంలో ఎమ్మెల్యే బడ్డుకొండ ప్రత్యేక పూజలు- భారీ అన్న సమారాధన



స్వామివారి సన్నిధిలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల: పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో నిర్మించిన శ్రీ వేంకటాచల దివ్య క్షేత్రంలో శ్రీవేంకటేశ్వరస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారి విగ్రహాలను ఆలయంలో ప్రతిష్ఠించారు. నూతనంగా రూపొందించిన ధ్వజ స్థంభాన్ని కూడా ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించారు. ఆలయ పై భాగంలో విమాన శిఖర స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠను అర్చకులు గావించారు. ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా ఆలయంలోనూ, యాగశాలలోనూ విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, అగ్నిధ్యానములు, రత్నన్యాసం, పూర్ణాహుతి, ధాతున్యాసం, యంత్రస్థాపన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, నగర పంచాయతీ వైస్‌చైర్మన్ కారుకొండ వెంకట కృష్ణారావు, హరీష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొని, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. సుమారు పది వేల మంది భక్తులు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

వేంకటేశ్వరుని సన్నిధిలో ఉపసభాపతి కోలగట్ల



వేంకటేశ్వరుని సన్నిధిలో ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి కుటుంబ సభ్యులు

విజయనగరం: ప్రజలందరికీ శుభాలు కలగాలని.. కలియుగ వైకుంఠుడు శ్రీవేంకటేశ్వరుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపైనా ఉండాలని రాష్ట్ర శాసన సభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి అభిలషించారు. గురువారం తెల్లవారుజామున డిప్యూటీ స్పీకర్ కోలగట్ల.. కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరికీ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని.. రాష్ట్ర అభివద్దే లక్ష్యంగా, ప్రజారంజక పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శ్రీనివాసుడు మరింత శక్తిని ప్రసాదించాలని కోరుకున్నట్టు తెలిపారు. ఆయన వెంట ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, పైడితల్లి అమ్మవారి దేవస్థాన పాలక మండలి సభ్యులు ఎంకేబి, ఎస్‌వీఎన్ గ్రూప్స్ చైర్మన్ జి.శ్రీనివాసరావు, డాక్టర్ వెంకటేశ్వర రావు, ప్రముఖ వ్యాపారవేత్త ఊటి తదితరులు ఉన్నారు.

జోరువాన

విజయనగరం జిల్లా కేంద్రంలో గురువారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. కొద్ది రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో అల్లాడిపోయిన ప్రజలు కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు.

\- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



సింహాచలం మేడ రోడ్డులో వాహనాల వెలుగులో వర్షం



కోట ప్రాంతంలో కురుస్తున్న వర్షం

ఇళ్ల నిర్మాణాల ప్రక్రియ వేగవంతం కావాలి



రామతీర్థంలో ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రమణమూర్తి

నెల్లిమర్ల రూరల్: గ్రామాల్లో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల ప్రక్రియ వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎస్‌వీ రమణమూర్తి సూచించారు. మండలంలోని సతివాడ, రామతీర్థం గ్రామాల్లో గురువారం హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్న లే అవుట్‌లను సందర్శించి ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సంబంధిత అధికారులతో చర్చించారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించుకోవాలని సూచించారు. ఈ నెలాఖరుకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. అనంతరం సతివాడ ఆదర్శ పాఠశాలలో జేవీకే స్టాక్ పాయింట్‌ను సందర్శించారు. ప్రభుత్వం సరఫరా చేసిన నోట్ పుస్తకాలు, యూనిఫామ్స్ పరిశీలించి పాఠశాల ప్రారంభం నాటికి పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గిరిబాల, ఎంఈఓ కృష్ణారావు, హౌసింగ్ ఏఈ రేవళ్ల పవన్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న అప్పారావు

- రాష్ట్ర బాలల హక్కుల, పరిరక్షణ కమిషన్ చైర్మన్ అప్పారావు

విజయనగరం రూరల్: 18 ఏళ్లు నిండకుండా బాల్య వివాహాలను ఎవరైనా ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర బాలల హక్కుల, పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు హెచ్చరించారు. విజయనగరం మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం 2006 బాల్య వివాహాల నిరోధక చట్టంపై మండల స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేసలి అప్పారావు మాట్లాడుతూ బాల్య వివాహాల్లో జిల్లా రాష్ట్ర స్థాయిలో ఐదో స్థానంలో ఉండటం బాధాకరమన్నారు. జిల్లాలో బాల్య వివాహాలు పూర్తిగా నిరోధించడానికి గ్రామ స్థాయి నుంచి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. పాఠశాలల బడి మధ్యలో మానేసిన విద్యార్థులు, సోషల్ మీడియా ప్రభావంతో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. కనీస వయస్సు నిండకుండా బాల్య వివాహాలు జరిపితే అనేక అనర్థాలు జరుగుతాయన్నారు. గ్రామ స్థాయిలో వీఆర్వోలు, అంగన్‌వాడీ కార్యకర్తలు బాల్య వివాహాలను గుర్తించి, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అప్పటికీ వివాహం జరిపితే ఉన్నతధికారులకు తెలియపర్చాలన్నారు. ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంకటరావు, బాలల హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షులు హిమబిందు, సీడీపీఓ డి.ఉమాభారతి, ఐసీడీఎస్ నోడల్ అధికారిణి కె.విజయకుమారి, సూపర్‌వైజర్లు టి.జానకి, సీహెచ్.కృష్ణవేణి, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండల శాఖ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యం



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

- ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

బొండపల్లి: రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సమప్రాధాన్యం ఇస్తున్నారని, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతున్నారని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని దేవుపల్లి గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో గురువారం అయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ క్యాలెండర్‌ను ప్రకటించి, ఎన్ని ఇబ్బందులు ఉన్నా చెప్పిన తేదీకి పథకాలను అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఇటీవల ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని చెప్పారు. చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా ఉన్న కాలంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి శూన్యం అని అన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గజపతినగరంలోని 30 పడకల ఏరియా ఆస్పత్రిని 100 పడ కల స్థాయికి పెంచామని గుర్తు చేశారు. అలాగే రూ.17 కోట్లతో ఆస్పత్రి భవన నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. గ్రామాలకు తారు రోడ్డులు వేయిస్తున్నామని, గజపతినగరం బైపాస్ రోడ్డు పనులు చేపడుతున్నామని చెప్పారు. కొట్టక్కి నుంచి గొట్లాం వరకు చేపడుతున్న జాతీయ రహదారి-26 విస్తరణ పనులు తుది దశకు చేరుకున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలునాయుడు, ఎంపీపీ చల్లా చలంనాయు డు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఈదుభిల్లి కృష్ణ, వైస్ ఎంపీపీ మీసాల సరోజిని, గొట్లాం,రాచకిండాం పీఏసీఎస్ చైర్మన్‌లు మహంతి రమణ, గొల్లు సతీష్, మాజీ ఎంపీపీ బండారు బంగారం, ఎంపీటీసీ రాపాక వెంకటలక్ష్మి, తహసీల్దార్ డి.జి.ఎస్.ఎన్.ప్రసాద్, ఎంపీడీఓ వై.వి.రాజేంద్ర ప్రసాద్, పంచాయతీ రాజ్ జేఈఈ కృష్ణమూర్తి, జేసీఎస్ మండల కన్వీనర్ పల్లి రఘు, నాయకులు రాపాక సాయి కుమార్ పాల్గొన్నారు.

15లోగా ఇంటర్ విద్యార్థులు ప్రవేశాలు పొందాలి

నెల్లిమర్ల: స్థానిక మహాత్మ జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఫలితాలు వెల్లడైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేబీబీ రావు తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కళాశాలలోని ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో మొత్తం 140 సీట్లకుగాను 126 మంది మొదటి విడతగా సీట్లు సాధించారన్నారు. విజయనగరం, పార్వతీపురం - మన్యం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన విద్యార్థులకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. వారందరికీ ఫోన్ చేయడం, వాట్సాప్, షార్ట్ మెజేజ్ ద్వారా సమాచారం తెలియజేస్తున్నట్లు చెప్పారు. సీట్లు సాధించిన విద్యార్థులు ఈ నెల 15వ తేదీలోగా ప్రవేశాలు పొందాలని సూచించారు. విద్యార్థులు తమ మార్క్స్ మెమో, టీసీ, స్టడీ సర్టిఫికెట్, విద్యార్థితో పాటు తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, రేషన్ కార్డు, ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, తల్లి బ్యాంక్ పాస్ పుస్తకం, విద్యార్థివి 6, తల్లిదండ్రులవి నాలుగేసి చొప్పున పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలన్నారు. 15లోగా ప్రవేశాలు పొందకపోతే సదరు విద్యార్థుల సీట్లు రద్దవుతాయని ప్రిన్సిపాల్ తెలిపారు.

మెగా జాబ్ మేళాను వినియోగించుకోండి

- నేడు చీపురుపల్లిలో జాబ్‌మేళా

చీపురుపల్లి: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత కోసం శుక్రవారం మెగా జాబ్ మేళాను ప్రభుత్వం నిర్వహిస్తోందని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 9 గంటలకు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జాబ్ మేళా ప్రారంభమవుతుందన్నారు.అపోలో, టీసీఎల్, మెడ్‌ప్లస్, జయభేరి ఆటోమోటివ్స్, వరుణ్ మోటార్స్, హెటిరో, డెక్కన్, ఆరబిందో, గ్రీన్ టెక్ తదితర 15కు పైగా ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు ఆయా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని చెప్పారు. అన్ని పరిశ్రమల నుంచి దాదాపు 1,700 వరకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ఇక్కడ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ చదువుకున్న యువత అర్హులని, జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాయకులు రఘుమండ త్రినాథ్, మీసాల రమణ, మీసాల ఈశ్వరరావు, మీసాల రఘు పాల్గొన్నారు.